# భారతీయ సంస్కృతికి ప్రతీక యోగ

**రాష్ట్ర యోగా పతక విజేతలకు మంత్రుల అభినందన..**
**జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి**
**మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్**



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

భారతీయ సంస్కృ తి సాంప్రదాయానికి ప్రతీక యోగా అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు శనివారం ఉదయం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో ఇటీవల రంగారెడ్డి జిల్లాలోని ఎస్ఎంపీ అంతర్జాతీయ పాఠశాలలో తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లా యోగా క్రీడాకారులను అభినందిస్తూ జాతీయస్థాయిలో కూడా పథకాలు సాధించాలని కోరి నారు ప్రపంచానికి భవద్గీతను అందించిన భారత దేశం నేడు యోగాను విశ్వవ్యాప్తంగా అమలు చేయడం భారతదేశము యొక్క కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యోగా సాధన వలన సార్వత్రిక శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుందని మరియు వ్యక్తి పరిపూర్ణతకు యోగా దోహదపడుతుందని అన్నారు, కావున ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వా ములు కావాలని ఆయన కోరారు. యోగాను ముందు తరాల వారికి అందించాలనే లక్ష్యంతో యోగా క్రీడాకారుల సంక్షేమా న్ని గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు యోగాను స్పోర్ట్స్ కోటాలో చేర్చా రని తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాంచి లో ఈనెల 27 నుంచి 30 వరకు జరుగు జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వి.అంజనీ కుమా ర్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కార్యదర్శి గుంటి రామకృష్ణ, కోశాధికారి పి. స్వరూప చారి, బండ రమణా రెడ్డి యోగ కోచులు కిష్టయ్య ,ఆనంద కిషోర్, ప్రవీణ్, వీణ పాల్గొన్నారు.




# 'అమాట్–2025' వాల్ పోస్టర్ విడుదల

**శెనార్తి మీడియా, కరీంనగర్:** శ్రీనివాస రామానుజన్ భారత శాస్త్రవేత్తల్లో అత్యుత్తములని, ఆయన చేసిన కృషి అనేక మందికి మార్గదర్శకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయంలో 'అమాట్–2025' వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 3–10 తరగతుల సీబీఎస్ఈ, స్టేట్, ఐసిఎస్ఇ విద్యార్థులకు 'అమాట్' పరీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ పరీక్ష 100 మార్కులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి సరైన జవాబుకు 4 మార్కులు, తప్పు జవాబుకు –1 మార్కు విధానాన్ని అమలు చేస్తున్న ట్లు తెలిపారు. ప్రతి తరగతిలో మొదటి 20 స్థానాల్లో నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, బహుమతులు అందజేస్తారు. అదే విధంగా మొత్తం మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా ₹5000, ₹3000, ₹2000 నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు ప్రదానం చేయనున్నారు. విజేతలకు ఈనెల 22న జరిగే రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అభ్యర్థులు ఈనెల 12లోగా పేరు నమోదు చేసుకోవచ్చని, వివరాలకు 92469 34441, 92469 34456, 93982 30614లను సంప్రదించవచ్చని తెలి పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# టాస్క్ మెగా జాబ్ మేళాలో గాయత్రి విద్యార్థులకు ఉద్యోగాలు

**శెనార్తి మీడియా, పెద్దపల్లి :**

**డిసెంబర్6:** పెద్దపల్లి టాస్క్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారు. డి. స్రవంతి, సానియా తరణం, కే. శశాంక, కే. మానస టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఎంపికయ్యారు. నాజరిన్ సుల్తానా ఆప్టికల్ హెల్త్ సొల్యూషన్స్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థల్లో ఉద్యోగాలు పొందింది. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్ అందించిన సహకారానికి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థినులను గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జే. రవీందర్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం సమీక్ష
- ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కఠిన చర్యలు




**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కరీంనగర్ పోలీసు కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలను చేపట్టింది. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పోలీసులు కమిషనర్ గౌష్ ఆలం భద్రతా ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. సమస్యాత్మక కేంద్రాలు, ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలీసు బలగాలను కేటాయించాలని స్టేషన్ హౌస్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విడతల ప్రకారం రూట్‌వారీగా పెట్రోలింగ్ వాహనాలను కేటాయించేందుకు ప్రణాళిక రూపొందించారు. సిబ్బంది కేటాయింపులను పరిశీలించి, వారికి అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఫ్లాగ్ మార్చ్‌లు తప్పనిసరిగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలు, బెదిరింపులకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నియమావళిపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని రౌడీషీటర్లపై బైండోవర్ ప్రక్రియ పూర్తయిందని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వారి కదలికలపై నిరంతర నిఘా కొనసాగుతోందని వివరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తులు లేదా పార్టీల ప్రతినిధులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రలోభాలు, బెదిరింపులు లేదా హింసాత్మక చర్యలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు పోలీసు విభాగానికి పూర్తి సహకారం అందించాలని కమిషనర్ గౌష్ ఆలం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్, మాధవి, విజయకుమార్, వెంకటస్వామి, యాదగిరిస్వామి, వేణుగోపాల్, వాసాల సతీష్‌తో పాటు ఇతర అధికారులు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## భగవద్గీత–వ్యాసరచన పోటీల్లో మెరిసిన
# వింధ్యావ్యాలీ విద్యార్థులు



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

గీతా జయంతి సందర్భంగా ప్రజ్ఞ, వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి భగవద్గీత, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో వింధ్యావ్యాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. భగవద్గీత శ్లోకము–భావము విభాగంలో మన్విత్ (7వ), యశస్వి (6వ), సహస్ర, సంహిత (5వ) పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రాలు పొందారు. వ్యాసరచన విభాగంలో సహన, సిరివెన్నెల (8వ) ప్రతిభ కనబరిచి ప్రశంసపత్రాలు అందుకోగా, చిత్రలేఖన విభాగంలో చైత్రిక (3వ), ఆద్య (5వ) పురస్కారాలు సాధిం చారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసపత్రాలు పీఠాధిపతి స్వామీజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వింధ్యావ్యాలీ పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాష్ రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

# సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా న్యాలపట్ల రాజు



**శెనార్తి మీడియా, కరీంనగర్:** సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నగరానికి చెందిన న్యాలపట్ల రాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కట్టారాంపూర్‌కు చెందిన రాజు గత మూడు దశాబ్దాలుగా సిపిఐలో కార్యకర్తగా, ప్రజా సంఘాలలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం సిపిఐ నగర సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్న రాజు పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలపై ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేయగల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజును జిల్లా కార్యవర్గంలోకి ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ వివరించారు. జిల్లా పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని న్యాలపట్ల రాజు వెల్లడించారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు



- జాతీయ లోక్ అదాలత్ సిద్ధతపై సమన్వయ సమావేశం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

డిసెంబర్ 21న జరిగే జాతీయ లోక్ అదాలత్ ఏర్పాట్లపై శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. వీరయ్య మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మంచిర్యాల సహా బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట న్యాయస్థానాల్లో ఒకేసారి లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.మోటార్ వాహన నష్టపరిహారం, ఎన్ఐ యాక్ట్, క్రిమినల్ కేసులు, సివిల్ దావా లు వంటి అంశాలను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న కాంపౌండబుల్ కేసుల పరిష్కారంపై పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.గ్రామాల్లో కక్షిదారులను కలసి లోక్ అదాలత్ ప్రయోజనాల ను స్పష్టంగా వివరించి, సాధ్యమైనన్ని కే సులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించా రు. న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే అవసరమైన న్యాయ సలహా, సహాయం అందించబడుతుందని పేర్కొ న్నారు.సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ. నిర్మల, డీసీపీ ఏ. భాస్కర్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, సివిల్ జడ్జి రామ్మో హన్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు కవిత, నిరోష, ఎక్సైజ్ మెజిస్ట్రే ట్ కృష్ణ తేజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అధికారులు, పోలీసులు, ఏసీపీలు పాల్గొన్నారు.






# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో ఘన నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. డిసిసి కార్యాలయం, కోర్ట్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, శ్రావణ్ నాయక్, మడుపు మోహన్ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళి అర్పించారు. తర్వాత నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో కోర్ట్ చౌరస్తా వద్ద కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే–ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు–చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్ రావు తదితరులు హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దేశ రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు అందేలా రూపొందించిన అంబేద్కర్ ఆలోచనా విధానం శాశ్వతమని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని, అంబేద్కర్ చూపిన మార్గం ప్రజాస్వామ్య బలపాటుకు దారితీస్తుందని అన్నారు. ప్రజా పాలన కోసం కాంగ్రెస్ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమాల్లో ఎండి తాజ్, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, కర్ర రాజశేఖర్ పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల (లక్షెట్టిపేట):** లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెల్తపు సుధాకర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం ఉత్సాహంగా సాగింది. బ్యాట్ గుర్తుకు ఓటు వేసి సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు ప్రచారంలో సూచించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని గ్రామ ప్రజలను కోరారు.ప్రచార కార్యక్రమంలో నల్మాస్ కాంతయ్య, చుంచు చిన్నయ్య, పొడేటి శ్రీనివాస్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.






## మూడో వన్డేలో భారత్ ఘన విజయం..

# వన్డే సిరీస్ కైవసం

**వైజాగ్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో వన్డే మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. మరో 10 ఓవర్లు ఉండగానే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సూపర్ విక్టరీ కొట్టింది.

ఈ మ్యాచ్ లో యంగ్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ కెరీర్ లో తొలి శతకం నమోదు చేశాడు. 111 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో జైస్వాల్ సెంచరీ అందుకున్నాడు. మరో ఓపెనర్ రోహిత్ శర్మ కూడా 75 పరుగులతో రాణించాడు. ఇక, విరాట్ కోహ్లీ మరోసారి తనదైన శైలిలో దక్షిణాఫ్రికా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 45 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులతో 65 పరుగుల అజేయ అర్ధ శతకంతో చెలరేగాడు. దీంతో భారత్ 2–1తేడాతో వన్డే సిరీస్ ను కైవసం చేసుకుంది. కాగా, ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు 47.5 ఓవర్లలో 270 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఓపెనర్ డికాక్ 89 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సుల సాయంతో 106 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. కెప్టెన్ బవుమా 48 పరుగులు, బ్రెవిస్ 29 పరుగులు, మహారాజ్ (నాటౌట్) 20 పరుగులు, యాన్సెన్ 17 పరుగులు చేశారు. భారత బౌలింగ్‌లో కుల్దీప్, ప్రశిద్ధ్ చెరి నాలుగు, అర్షదీప్, జడేజా తలో వికెట్ తీశారు.

# పవర్ హిట్టింగ్..

## రోహిత్ శర్మ ప్రపంచ రికార్డు

టీమిండియా–సౌతాఫ్రికా జట్లు వైజాగ్ వేదికగా మూడో వన్డేలో తలపడుతున్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు చేసిన సౌతాఫ్రికా.. టీమిండియాకు 271 లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనకి దిగిన భారత్ ఆది నుంచి నిలకడగా ఆడుతుంది. ఈ క్రమంలో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఓ కీలక మైలురాయిని అందుకున్నాడు.

**ప్రపంచంలోనే..**

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 20,000 పరుగుల మార్కును అధిగమించాడు. ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే 14వ ఆటగాడిగా.. భారత నాలుగో క్రికెటర్‌గా రోహిత్ శర్మ రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్(34,357 పరుగులు), విరాట్ కోహ్లీ(27,910 పరుగులు), రాహుల్ ద్రవిడ్(24,064 పరుగులు) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. మరోవైపు హిట్‌మ్యాన్‌కు విశాఖలో ఇది మూడో హాఫ్ సెంచరీ కావడం విశేషం. రోహిత్ తన కెరీర్‌లో ఇప్పటివరకు 50 సెంచరీలు, 110 హాఫ్ సెంచరీలు పూర్తి చేశాడు. భారత్ తరఫున 50 అంతర్జాతీయ సెంచరీలు చేసిన మూడో ఆటగాడిగా రోహిత్ నిలిచాడు. అతడికి ముందు సచిన్(100), విరాట్(83) ఉన్నారు. వన్డేల్లో ఇండియాలో రోహిత్.. 5వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు.

**ఫార్మాట్ల వారీగా..**

రోహిత్ శర్మ తన కెరీర్‌లో 500 కంటే ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు(505) ఆడిన ఐదో భారత ప్లేయర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో రోహిత్ ముందు సచిన్, విరాట్, ధోనీ, ద్రవిడ్ ఉన్నారు. పరుగుల ఫార్మాట్ వారీగా చూస్తే.. వన్డే క్రికెట్‌లో 33 సెంచరీలతో 11,450ం పరుగులు సాధించి భారత్ తరఫున మూడో అత్యధిక రన్–గెటర్‌గా ఉన్నారు. టెస్టుల్లో ఆయన 12 సెంచరీలతో 4,301 పరుగులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డు స్థాయిలో 5 సెంచరీలతో 4,231 పరుగులు నమోదు చేశారు.



## రికార్డు సృష్టించిన

# డికాక్



టీమిండియా–సౌతాఫ్రికా మధ్య వైజాగ్ వేదికగా మూడో వన్డే కొనసాగుతోంది. ఇప్పటికే ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1–1తో సమంగా ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ గెలుచుకోవాలని ఇరు జట్లు పోటీ పడుతున్నాయి. తొలుత టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్.. ప్రొటీస్ జట్టును బ్యాటింగ్‌ను ఆహ్వానించింది. తొలి ఓవర్‌లోనే అర్షదీప్ సింగ్‌కు ర్యాన్ రికెల్టన్(0) రూపంలో శుభారంభం దక్కింది. అయినప్పటికీ ఇతర ఓపెనర్ క్వింటన్ డికాక్(106) అద్భుత సెంచరీతో చెలరేగాడు. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో రాణించలేకపోయిన డికాక్.. ఈ డిసైడింగ్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసి పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.

**ప్రపంచ రికార్డు బద్దలు**

టీమిండియాపై వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా డికాక్ రికార్డు సృష్టించాడు. భారత్‌పై డికాక్‌కు ఇది ఏడో సెంచరీ. ఇంతకు ముందు ఈ రికార్డు శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య పేరిట ఉంది. అతడు టీమిండియాపై 85 ఇన్నింగ్స్‌ల్లో ఏడు సెంచరీలు చేశాడు. అయితే క్వింటన్ డికాక్ కేవలం 24 ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్ అందుకోవడం విశేషం. భారత్‌తో ఆడిన తొమ్మిది సార్లు 50 లేదా అంతకంటే ఎక్కువ స్కోరు చేసిన డికాక్.. ఏడు సార్లు ఆ స్కోరును సెంచరీగా మలిచాడు.

# విశాఖకు పోటెత్తిన జనం

మూడు వన్డేల సిరీస్ లో భాగంగా భారత్, సౌతాఫ్రికా మధ్య చివరి వన్డే విశాఖపట్నం వేదికగా జరగనుంది. మరికాసేపట్లో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటికే 1–1తో రెండు జట్లు సమనంగా ఉంటడంతో చివరి వన్డే అయిన విశాఖ మ్యాచ్ పై అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టు సిరీస్ ను కైవసం చేసుకుంటుంది. విశాఖ పట్నం వేదికగా ఈ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానులు భారీగా స్టేడియానికి తరలి వచ్చారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచి భారత్ బౌలింగ్ ఎంచుకుంది. 2023 వరల్డ్ కప్





సెమీఫైనల్ నుంచి నేటి వరకు 20 వన్డే టాస్ లను భారత్ ఓడింది.
ఈ మ్యాచ్‌కు ముందు వరుసగా 20 సార్లు టాస్ ఓడిపోయిన భారత్
రెండేళ్ల 21 రోజుల తర్వాత టాస్ గెలిచిన టీమిండియా
చెత్త రికార్డ్‌కు బ్రేక్ చేసిన కేఎల్ రాహుల్

**మ్యాచ్‌కు భారీ భద్రత:**

ఇక భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం జరుగుతున్న వన్డే క్రికెట్ మ్యాచ్ కు సుమారు రెండు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేడియం చుట్టూ గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. డాగ్ స్క్వాడ్‌తో పిచ్, ఔట్ ఫీల్డుతో పాటు గ్యాలరీలు, పరిసరాలు శుక్రవారం తనిఖీ చేశారు. అన్ని గేట్ల వద్ద క్యూలో ప్రేక్షకులను లోపలికి పంపిస్తున్నారు. మ్యాచ్ సుమారు రాత్రి 11 గంటల సమయంలో ముగుస్తుందని వేల సంఖ్య లో వాహనాలు జాతీయ రహదారిపైకి రాకుండా చోదకులు సంయమనం పాటించి కొద్ది నిమిషాల వ్యవధిలో వెళ్లాలని అధికారులు కోరుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తవన్నారు.



## యశస్వీ జైస్వాల్ తొలి శతకం..

**వైజాగ్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో చివరి వన్డే మ్యాచ్‌లో టీమిండియా యంగ్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ శతకం నమోదు చేశాడు. 111 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్ సాయంతో సెంచరీ అందుకున్నాడు. జైస్వాల్ కు వన్డేలో ఇది తొలి సెంచరీ. అంతకుముందు మరో ఓపెనర్ రోహిత్ శర్మ 75 పరుగులతో రాణించారు. రోహిత్, జైస్వాల్ కలిసి తొలి వికెట్ కు 155 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ప్రస్తుతం టీమిండియా 36 ఓవర్లలో వికెట్ నష్టానికి 221 పరుగులు చేసింది. క్రీజులో జైస్వాల్(100), కోహ్లీ(33)లు ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 50 పరుగులు చేయాల్సి ఉంది.

## స్టీవ్ స్మిత్ అరుదైన ఘనత..

# అతడిని దాటేశాడు..

ఆసీస్ స్టార్ ఆటగాడు స్టీవ్ స్మిత్ తన కెరీర్‌లో ఎన్నో రికార్డులు సాధించాడు. ఈ తరంలో ఉత్తమ టెస్ట్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్ ఒకడని చెప్పుకోవచ్చు. అయితే ప్రస్తుతం జరుగుతున్న యాసెస్ సిరీస్‌లో స్మిత్ చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సాధించాడు. గతంలో ఈ రికార్డు మార్నస్ లబుషేన్ పేరిట ఉండేది. అయితే యాషెస్ రెండో టెస్ట్ మ్యాచ్‌లో అర్ధ శతకం సాధించిన స్మిత్ ఈ క్రమంలో లబుషేన్‌ని దాటేశాడు. ప్రస్తుతం లబూషేన్ ఖాతాలో 4350 పరుగులు ఉండగా.. స్టీవ్ ఖాతాలో 4358 పరుగులు ఉన్నాయి.



మొత్తంగా డబ్ల్యూటిసి అత్యధిక పరుగుల రికార్డు ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్ పేరిట ఉంది. రూట్ డబ్ల్యూటిసిలో 6226 పరుగులు చేశాడు. రూట్ తర్వాతి స్థానంలో స్టీవ్ స్మిత్ ఉండగా.. అతడికి, రూట్‌కి మధ్య దాదాపు 2వేల పరుగుల వ్యత్యాసం ఉంది. ఇక యాషెస్ రెండో టెస్ట్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 334 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో జో రూట్ (138) సెంచరీ సాధించగా,, క్రాలీ (76), ఆర్చర్ (38) పరుగులు చేశారు. అనంతరం ఆస్ట్రేలియా వికెట్లు కాపాడుకుంటూ స్కోర్ చేస్తూ వచ్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 378 పరుగులు చేసి 44 పరుగులు ఆధిక్యంలో ఉంది. క్రీజ్‌లో అలెక్స్ క్యారీ (46), నీసర్(15)ఉన్నారు.

# ఓటీటీలోకి ధూల్‌పేట్ పోలీస్ స్టేషన్



డిజిటల్ రంగంలో 100 శాతం వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతోంది ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా . ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్ని సూపర్‌హిట్ సినిమాలు, థ్రిల్లింగ్ సస్పెన్స్ వెబ్ సిరీస్?లను సినీ ప్రియులకు అందించింది. అలాగే అన్‌స్టాపబుల్ అంటూ టాక్‌షోలు, తెలుగు ఇండియన్ ఐడల్ సింగర్ సింగింగ్ షోలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అదిరిపోయే వెబ్ సిరీస్ లను అందించింది ఆహా. ఇక ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఆహాలో ఇప్పటికే ఎన్నో రకాల వెబ్ సిరీస్ టాప్ లో దూసుకుపోతున్నాయి. తాజాగా ఓ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ అందుబాటులోకి వచ్చింది.ఆ సిరీస్ మరేదో కాదు ధూల్ పేట్ పోలీస్ స్టేషన్. ఇప్పటికే ఈ సిరీస్ నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ సిరీస్ పై అభిమానుల్లో ఆసక్తి పెంచేశాయి. నేటి నుంచి ఈ సిరీస్ ప్రేక్షకులకు ఆహాలో అందుబాటులోకి వచ్చింది. ఇంట్రెస్టింగ్ స్టోరీతో ఈ సిరీస్ తెరకెక్కిందని అంటున్నారు.తమిళ యాక్టర్స్ అశ్విన్, శ్రీతు కృష్ణన్, గురు ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ కు జస్విని దర్శకత్వం వహించారు. ఆసక్తికరమైన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సిరీస్.. ఈ శుక్రవారం( నేటి నుంచి) తెలుగు, తమిళంలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. అలానే ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు కొత్త ఎపిసోడ్ రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో నేడు ( శుక్రవారం) ఓ ఎపిసోడ్ ను రిలీజ్ చేశారు. ఇక ధూల్ పేట్ అనే ఊరిలో ఓ రోజు రాత్రి మూడు హత్యలు జరుగుతాయి. వీటిని దర్యాప్తు చేసేందుకు ఓ ఏసీపీని అపాయింట్ చేస్తారు. అతను నేరస్థులను పట్టుకోలేకపోతాడు. దీంతో మరో ఏసీపీని కూడా కేసుని దర్యాప్తు చేసేందుకు నియమిస్తారు. తర్వాత ఏమైంది? అసలు ఆ హత్యలు చేసింది ఎవరు.? ఎందుకు అనేది సిరీస్ లో చూడాల్సిందే..

## సెట్స్‌లో అడుగుపెట్టిన సమంత.. !!



ఇటీవలే రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలో అడుగుపెట్టిన సమంత రూత్ ప్రభు.. పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ అడుగుపెట్టింది. తన బ్యానర్ లో స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ఫోకస్ పెట్టింది. క్రైమ్ థ్రిల్లర్ గా వస్తున్న ఈ సినిమాపై అప్పుడే అంచనాలు పెరిగిపోయాయి. ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత భర్త రాజ్ నిడిమోరు ఈ సినిమాకి కో-ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు. సమంత రూత్ ప్రభు ఇటీవలే దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 1వ తేదీల తెల్లారుజామున వీరి వివాహం జరిగింది. కొత్త జీవితం ప్రారంభించిన సామ్.. కొన్ని రోజులు సినిమా షూటింగులకు బ్రేక్ తీసుకుంటుందని అభిమానులు భావించారు. అయితే సమంత పెళ్లైన నాలుగు రోజులకే సెట్స్ లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని డైరెక్టర్ నందిని రెడ్డి సోషల్ మీడియాలో వెల్లడించింది. సమంత స్వీయ నిర్మాణంలో ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. నందిని రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సామ్ తో పాటుగా గుల్షన్ దేవయ్య, దిగంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దసరా పండక్కి ఈ సినిమాని పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. తాజాగా సామ్ తిరిగి షూటింగ్‌లో జాయిన్ అయినట్లు నందిని రెడ్డి ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టింది. ఒక ఫొటోని షేర్ చేసింది. ఇంతకుముందు మహానటి కీర్తి సురేష్ కూడా ఇలానే కాళ్ల పారాణి ఆరకముందే సినిమా పనుల్లో బిజీ అయింది.

మోడ్రన్ డ్రెస్సులు, మెడలో పసుపు తాడుతో 'బేబీ జాన్' మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొంది. ఇప్పుడు సమంత సైతం పెళ్లి చేసుకున్న కొన్ని రోజులకే షూటింగ్ లో అడుగుపెట్టింది. తన బ్యానర్ లో రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం సామ్ - గుల్షన్ దేవయ్య పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్లు సమాచారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థ ప్రారంభించి సమంత.. తొలి ప్రయత్నంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ లో రాజ్ నిడిమోరు కూడా భాగం పంచుకున్నాడు. ఇప్పుడు అదే బ్యానర్ లో ప్రొడక్షన్ నెం.2గా 'మా ఇంటి బంగారం' చిత్రం తెరకెక్కుతోంది. దీనికి రాజ్ కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. 'ఓ బేబి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత సమంత, నందినీ రెడ్డి కలిసి చేస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడింది. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో గ్రిప్పింగ్ యాక్షన్ డ్రామాగా 'మా ఇంటి బంగారం' రూపొందుతోందని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సీతా మీనన్, వసంత్ మరిన్‌గంటి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తుండగా.. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సమంత ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంది.



# ఆంధ్ర కింగ్ తాలుకా కలెక్షన్స్ జోరు

బాక్స్ ఆఫీస్ దగ్గర లాస్ట్ వీక్‌లో మంచి అంచనాల నడుమ రిలీజ్ అయిన ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటించిన ఆంధ్ర కింగ్ తాలుకా సినిమా మంచి పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా అన్ని చోట్లా జోరు చూపెడుతుంది అనుకున్నా.. కూడా ఓవరాల్ గా ఆ రేంజ్ లో బాక్స్ ఆఫీస్ దగ్గర ఇంపాక్ట్ ని ఏమి చూపించలేక పోతున్న సినిమా మొదటి వీక్ ని ఎలాగోలా కంప్లీట్ చేసుకోగా రెండో వీక్ లో అడుగు పెట్టిన సినిమా మరింతగా డ్రాప్స్ ను అయితే కొనసాగిస్తూ ఉందని చెప్పాలి ఇప్పుడు.ఓవరాల్ గా 8వ రోజున 6 వేలకు పైగా టికెట్ సేల్స్ ను మాత్రమే సొంతం చేసుకున్న సినిమా తెలుగు రాష్ట్రలలో 25 లక్షల రేంజ్ లో షేర్ ని సొంతం చేసుకోగా వరల్డ్ వైడ్ గా 30 లక్షలకు పైగా షేర్ ని 60 లక్షలకు పైగా గ్రాస్ మార్క్ ని సొంతం చేసుకోగా.. మొత్తం మీద సినిమా 28 కోట్ల రేంజ్ లో వాల్యూ బ్రేక్ ఈవెన్ టార్గెట్ తో బరిలోకి దిగగా ఇప్పటి వరకు సాధించిన కలెక్షన్స్ కాకుండా ఇంకా 13.54 కోట్ల రేంజ్‌లో షేర్‌ని అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక ఈ వీకెండ్ లో సినిమా ఎలాంటి కలెక్షన్స్‌ని అందుకుంటుందో చూడాలి.

# ధనుష్ 100 కోట్ల మార్క్



బాక్స్ ఆఫీస్ దగ్గర హిందీలో చాలా టైం తర్వాత మంచి బజ్ తో వచ్చిన కోలివుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన హిందీ సినిమా తేరే ఇష్క్ మే సినిమా డీసెంట్ రివ్యూలను సొంతం చేసుకోగా కలెక్షన్స్ పరంగా సినిమా మంచి జోరుని చూపెడుతూ ఉండగా సినిమా ఓవరాల్‌గా.. వర్కింగ్ డేస్‌లో కూడా మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండగా 5 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 69.35 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకోగా 6వ రోజున వర్కింగ్ డే లో మరోసారి ఎక్స్ లెంట్ గా హోల్డ్ ని చూపించిన సినిమా.. 6.89 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ మార్క్ ని సొంతం చేసుకుంది.. ఇక టోటల్ గా 6 డేస్ కంప్లీట్ అయ్యే టైంకి సినిమా 76.24 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా డబ్ వర్షన్స్ తో కలిపి సినిమా 79.75 కోట్ల రేంజ్ లో నెట్ కలెక్షన్స్ ని అందుకోగా.. ఇండియాలో గ్రాస్ 93 కోట్ల రేంజ్ లో సొంతం చేసుకుంది. ఇక సినిమా ఓవర్సీస్ లో 1 మిలియన్ రేంజ్ లో వసూళ్ళని అందుకోగా ఓవరాల్ గా వరల్డ్ వైడ్ గా ఇప్పుడు 6 రోజుల్లో సాధించిన కలెక్షన్స్ తో 100 కోట్ల మార్క్ ని దాటేసి మాస్ రచ్చ చేయడం విశేషం.ధనుష్ కెరీర్ లో హిందీ లో ఇవి సెన్సేషనల్ కలెక్షన్స్ అని చెప్పాలి. ఓవరాల్ గా ఎక్స్ లెంట్ కలెక్షన్స్ తో కుమ్మేస్తున్న సినిమా హిందీ లో లాంగ్ రన్ లో 100 కోట్ల నెట్ కలెక్షన్స్ మార్క్ వైపు పరుగులు పెడుతూ ఉండటం విశేషం అని చెప్పాలి.ఇక సినిమా 7వ రోజున మరోసారి మంచి ట్రెండ్ ను చూపెడుతూ ఉండటంతో మరోసారి 6 కోట్ల రేంజ్ కి అటూ ఇటూగా నెట్ కలెక్షన్స్ ని అందుకునే అవకాశం ఉండగా లాంగ్ రన్ లో సినిమా ఏ రేంజ్ లో మాస్ రచ్చ చేస్తుందో చూడాలి ఇప్పుడు.

## నా పేరు చెప్పగానే నాగార్జున ఒప్పుకున్నారు



ఒకప్పుడు వరుస సినిమాలు, హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ డైరెక్టర్ రేసులోకి దూసుకొచ్చారు వి.సముద్ర. టాలీవుడ్ యాంగ్రీ యంగ్‌మెన్ డాక్టర్ రాజశేఖర్ హీరోగా వచ్చిన సింహరాశి సినిమాతో దర్శకుడిగా పరిచయమైన సముద్ర.. తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకోవడంతో పాటు రాజశేఖర్‌కు తిరుగులేని హిట్ అందించారు. ఈ విజయంతో సముద్రకు అవకాశాలు క్యూకట్టాయి. ఆ తర్వాత శివరామరాజు, టైగర్ హరిశ్చంద్రప్రసాద్, సూర్యం, మహానంది, విజయదశమి, ఏవడైతే నాకెంటీ, అధినేత, పంచాక్షరి, సేవాకుడు తదితర చిత్రాలను తెరకెక్కించారు. కానీ దురదృష్టవశాత్తూ వీటిలో చాలా సినిమాలు డిజాస్టర్ కావడం, యంగ్ టాలెంట్ రాకతో వి.సముద్రని తెలుగునాట పట్టించుకునేవారే కరువయ్యారు. తెలుగులో వర్కవుట్ కాకపోవడంతో ఇతర ఇండస్ట్రీలపైనా వి సముద్ర దృష్టి సారించారు. దీనిలో భాగంగా కన్నడంలో దివంగత చిరంజీవి సర్జాగా హీరోగా రణం చిత్రాన్ని తీశారు. దర్శకుడిగానే కాకుండా రెయిన్ బో సినిమాలో నటుడిగానూ కనిపించారు. ఆ తర్వాత ఏ సినిమాకు దర్శకత్వం వహించడం కానీ, నటించడం కానీ చేయలేదు. అలా క్రమంగా సినీ పరిశ్రమకు దూరమయ్యారు వి సముద్ర. ఇటీవల వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్న ఆయన తాజాగా ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ పంచాక్షరి సినిమా సమయంలో కింగ్ అక్కినేని నాగార్జునపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సముద్ర. పంచాక్షరి సినిమా డీలే అయ్యిందని వార్తలు వచ్చాయి.. కానీ అది నిజం కాదు. ఆ అమ్మాయి అనుష్క అరుంధతి చేశాక ఎవరికీ చేయలేదు, డేట్స్ ఇవ్వలేదు. చంద్రకి (నాగార్జున పర్సనల్ మేకప్‌మెన్) మాట ఇచ్చింది. చంద్రకు ఇండస్ట్రీలో చాలామంది దర్శకులతో పరిచయాలు ఉన్నాయి. రామ్ గోపాల్ వర్మ బ్యాచ్ మొత్తం పరిచయమే.. కృష్ణవంశీ, పూరీ ఇలా చాలామంది ఉన్నారు. అరేయ్ ఓరేయ్ అనుకునే బ్యాచ్ వీళ్లంతా. నేను నాగార్జున గారి డేట్స్ ట్రై చేసేవాడిని. నాగార్జున గారితో తిరిగేవాడిని, అప్పటికి చంద్రగారితో పరిచయం. ఏది ఉన్నా ఈయనతోనే కలిసేవాళ్లం. నేను డైరెక్టర్ అయ్యాక సినిమాలు చేస్తుండగా.. ఇప్పుడున్న వాళ్లు నా మాట వినరు, సముద్ర అయితే మంచోడు .. మాట వింటాడని నాగార్జున గారికి విషయం చెప్పాడు అని వి సముద్ర తెలిపారు. సముద్ర చాలా మంచోడు.. సముద్రని పెట్టుకోమని చంద్రకి నాగార్జున గారు చెప్పారు. అయితే సముద్రని ఒకసారి నన్ను కలవమను అని చెప్పారట. ఆ సమయంలో నాగార్జున.. కేడీ సినిమా షూటింగ్ గోవాలో జరుగుతోంది. ఇక్కడికి తీసుకొచ్చేయ్ సముద్రని అని నాగార్జున చెప్పడంతో నేను, చంద్ర కలిసి గోవాలో సెట్‌లో ఆయనను కలిశాం. అప్పుడు నాగార్జున ఒక్కటే అన్నారు.. శ్యాంప్రసాద్ రెడ్డి అరుంధతి తీశాడు.. ఆయన పెద్ద ప్రొడ్యూసర్. ఇక్కడుంది చంద్ర.. నా మేకప్‌మెన్ అంత ప్రొడ్యూసర్ కాదు. వీడి లైఫ్ జాగ్రత్త.. అంత బడ్జెట్ పెట్టించకుండా, ఇబ్బంది పెట్టకుండా జాగ్రత్తగా చేయ్.. ఏదైనా ఇబ్బంది ఉంటే నాతో చెప్పు అని ఈ ఒక్క మాటే చెప్పారు. కథ రెడీ అయ్యాక ఒకసారి చెప్పమని అన్నారు అని వి సముద్ర గుర్తుచేసుకున్నారు.

## థియేటర్లకు తీసుకురావడానికి
# మా వంతు ప్రయత్నం చేశాం

టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన అంశం అఖండ 2 విడుదల వాయిదా. మరికొన్ని గంటల్లో సినిమా థియేటర్లలోకి విడుదల కాబోతుండగా వాయిదా పడటం అందరికీ షాక్ ఇచ్చింది. నందమూరి అభిమానులు దీనిపై తీవ్రమైన అసంతృప్తిని సోషల్ మీడియాలో వ్యక్తం చేస్తున్నారు. 'ఇంత పెద్ద ప్రాజెక్ట్.. ఇంత పెద్ద స్టార్ హీరో సినిమా.. ఎలాంటి ప్లానింగ్ లేకుండా ఇలాంటి తప్పులు ఎలా జరుగుతాయి?'అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో అఖండ 2 నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ కీలక ప్రకటన చేసింది. బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'అఖండ తాండవం' కోసం తెలుగు ప్రేక్షకులతో పాటు నార్త్ ఇండియా ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంయుక్త మీనన్ హీరోయిన్‌గా, ఆది పినిశెట్టి విలన్‌గా నటించిన ఈ సినిమా డిసెంబర్ 4న ప్రీమియర్ షోలతో ప్రారంభమై, డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సింది. అయితే విడుదలకు కొన్ని గంటల ముందు అనుకోని పరిణామాలు చోటుచేసుకోవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అభిమానుల అంచనాలు, థియేటర్లలో ఏర్పాట్లు, బుకింగ్స్ అన్ని సిద్ధంగా ఉన్నా చివరి నిమిషంలో రిలీజ్‌పై సందిగ్ధత నెలకొనడంతో అందరూ నిరాశ చెందారు. అఖండ 2 తాండవం నిర్మించిన 14 రీల్స్ ప్లస్ సంస్థకు, హీరోస్ ఇంటర్నేషనల్ అనే సంస్థకు మధ్య ఉన్న పాత ఆర్థిక ఒప్పందాలు ప్రధాన వివాదంగా మారాయి. ఈ ఫైనాన్షియల్ అగ్రిమెంట్లపై తొలుత అంతర్గత చర్చలు జరిగినా, వివాదం పరిష్కారం కాకపోవడంతో హీరోస్ ఇంటర్నేషనల్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దాంతో కోర్టు సినిమా విడుదలపై స్టే విధించగా, ఇప్పటికే సిద్ధమైన దేశవ్యాప్తంగా ఉన్న షోలు, ఓవర్సీస్ స్క్రీనింగ్స్ అన్నీ నిలిచిపోయాయి. ఇండస్ట్రీ పరంగా, ప్రేక్షకులపరంగా ఇది చాలా అరుదుగా జరిగే పరిస్థితి. ముఖ్యంగా బాలకృష్ణలాంటి అగ్ర హీరో సినిమా పూర్తి స్థాయిలో ఆగిపోవడం ఇండస్ట్రీలో పెద్ద చర్చగా మారింది. అఖండ 2 విడుదలపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. 'అఖండ 2ని థియేటర్లకు తీసుకురావడానికి మా వంతు ప్రయత్నం చేశాం. కానీ కొన్నిసార్లు ఊహించని పరిస్థితులు ఎదురవుతాయి. అందువల్ల సినిమా ఈరోజు విడుదల చేయడం సాధ్యం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఈ పరిస్థితుల్లో కూడా మాకు తోడుగా నిలిచిన బాలకృష్ణ గారికి, దర్శకుడు బోయపాటి శ్రీనుకు కృతజ్ఞతలు. అఖండ 2 ఎప్పుడెప్పుడు వచ్చినా బ్లాక్‌బస్టర్ అవడం ఖాయం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం" అని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అఖండ 2 మేకర్స్ సోషల్ మీడియాలో ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన రావడంతో అభిమానుల్లో మరోసారి కన్ఫ్యూజన్ మొదలైంది. ఈ పరిణామాలతో బాలయ్య అభిమానుల్లో తీవ్ర అసహనం నెలకొంది. సినిమా విడుదల వాయిదా పడటంతో వారికి తీవ్ర నిరాశను కలిగించింది. సోషల్ మీడియాలో నిర్మాతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి కొత్త రిలీజ్ డేట్‌పై ఉంది. అఖండ 2 ఇప్పటికే ఎన్నోసారి వాయిదా పడటంతో అభిమానుల్లో నిరాశ నెలకొంది. అఖండ 2 సినిమా ఎప్పుడు విడుదల అవుతుంది? చాలా మంది భావిస్తున్నట్లుగా ఈ సినిమా సంక్రాంతి రేసులోకి తీసుకువస్తారా? లేక మరింత ఆలస్యం చేస్తారా? అన్నది త్వరలోనే తెలుస్తుంది.



Printed, Published and Owned by **V SAMPATH**, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**